

# చిన్నచేప

## పాలెపు బుచ్చిరాజు

ప్రతీ మనిషిలోనూ దేవుడూ, దానవుడూ అనే రెండు అంశాలు ఎప్పుడూ ఉంటూ ఉంటాయి. సమయాసమయాల్ని బట్టి ఏదో ఒకటి తన ఆధిక్యతని తెలుపుతూ బైట పడుతూంటుంది. మొదటిది ప్రకోపించినపుడు, ప్రతిఫలాపేక్ష లేకుండా మనిషి మంచిపనులు చేస్తాడు. రెండో దాని బలం ఎక్కువయినప్పుడు మాత్రం, తనకేమాత్రం లాభంలేని పనులు 'నే నెందుకు చేయాలీ' అని విర్రవీగుతాడు. ఎదుటివాళ్ళు కార్యశూరులైతే దేవుణ్ణి సామ, దానాల్తోటీ; దానవుణ్ణి భేద, దండోపాయాల్తోటీ లోబరుచుకుంటారు. ఈ ఉపాయాల ప్రయోగాలు కార్యసానుకూలతకి ముఖ్యాతి ముఖ్యమని వివరించి చెప్పనవసరం లేదు. ఉపాయంలేనివాణ్ణి ఊర్లోంచి తరిమేయమని మన పెద్దలు చెప్పినది పై విషయాలు దృష్టిలో ఉంచుకునే! ఇహపోతే ఆ అంశాలూ, ఈ ఉపాయాలూ తారుమారైనప్పుడే పెద్ద చిక్కొచ్చి పడుతుంది.

దాసు విషయంలో సరిగ్గా అలాంటిదే జరిగింది. బిక్కచచ్చిపోయిన మొహంతో చేతులు కట్టుకు నిల్చున్న దాసుని చూసి ప్రిన్సిపాలు దొరస్వామిలోని దానవుడు మరింత విజృంభించాడు. తెల్లటి బట్టల్తో! నిలువునా వణికిపోతూ,

నిస్సహాయంగా, చిన్ని తువ్వాయిలా నిలబడిన దానుపై గాండ్రుమన్న బెబ్బులిలా ఉంది దొరస్వామి కర్కశమైన కంఠస్వరం. నిజమే! ఆ చారలసూటులో కుర్చీలోంచి లేచి నిలబడ్డ ప్రిన్సిపాలు పులిలాగే తోచాడు. భయంతో రెండడుగులు వెనక్కివేశాడు దాసు.

"చెప్తోంటే నీక్కాదూ! ఎంత సేపని నా టైము వేస్టు చేస్తావ్? వీల్లేదని చెప్పాగా."

"అదికాదుసార్! ఒక్కరోజు గడువివ్వండిసార్. ఎలాగైనా తీసుకొచ్చి కడతాను సార్!"

"ఏమిటోయ్ కట్టేది నీ పాడె! ఈ రోజు లేనిది, ఇంపై నాలుగ్గంటల్లో అంత డబ్బు ఎక్కణ్ణించి వస్తుంది? ఎందుకనవసరంగా నన్ను విసిగిస్తావ్."

"మా మామయ్య దగ్గర్నుంచి మని యార్డరొకటి రావలసుంది సార్. ఈ రోజే రావల్సింది ఇంకా రాలేదు. లేకపోయినా. ఎక్కడైనా తల తాకట్టు పెట్టయినా సరే తెస్తాను సార్. నాకీ ఇరవై నాలుగ్గంటలూ టైమివ్వండి."

"ఆదేం కుదరదంటే నీకర్థంకాలేదా? యూనివర్సిటీ నీ బాబుగారి దనుకుంటున్నావా? అయినా ఇలా అయినవాళ్ళకీ కానివాళ్ళకీ టైమిచ్చి కూర్చుంటే నేను పై అధికార్లకెలా జవాబు చెప్పుకోవాలి? నువ్వేం చేస్తావో నాకు తెలియదు. పరీక్ష ఫీజు కట్టడానికి ఈ రోజే ఆఖరి రోజు. పొడిగించటానికి ఎట్టి పరిస్థితుల్లోనూ వీల్లేదు. కట్టలేకపోతే మళ్ళీ సంవత్సరం పరీక్ష చదువుగానిలే. ఈ ఏడే పాసై నువ్వీ దేశాన్ని ఉద్ధరించ నక్కర్లేదు. నీ ఒక్కడికోసం గడువిచ్చి నేను సంజాయిషీలు ఇచ్చుకోలేను. ఇంక నువ్వెళ్ళొచ్చు!" ఊపిరి పీల్చుకోడం కోసం క్షణం ఆగి, "పోలయ్యా!" అని గట్టిగా కేకేశాడు ప్రిన్సిపాలు. గాండ్రించి తడారిపోయిన గొంతుని గ్లాసుడు చన్నీళ్ళతో తడుపుకోవడం కోసం.

ఇక నిలబడి, చేసేదేమీ లేకపోవడంతో. అహంమీద తగిలిన పంజా దెబ్బకి గ్రుడ్లనిండా నీరు గ్రక్కుకుని, పులిబోనులాంటి ప్రిన్సిపాలు ఛేంబరులోంచి బైటపడ్డాడు దాసు.

ఆలోచించినకొద్దీ తన అసహాయత తన్నే పరిహసిస్తోంటే, మనసు గుంజకు కట్టేసిన కోడెదూడలా గింజుకుంటూంటే కార్యసాధన కిది విధానం కాదని, తనని తాను విభాయించుకునే ప్రయత్నం చేస్తున్నాడు దాసు. దూరంగా గంట స్తంభం పన్నెండు గంటలు కొట్టింది. 'పన్నెండు' ఇంకొక రెండు గంటలే వ్యవధి వుంది. ఈ రెండుగంటల్లోనూ, పరీక్షఫీజుకి కావలసిన డబ్బు సంపాదించి కట్టగలిగితే-తను సంవత్సరం అంతా పడిన శ్రమకి ఫలితం దక్కుతుంది. డిగ్రీ చేతికొస్తుంది. తనపొట్ట తాను పోషించుకోవచ్చు. అంతకంటే పెద్దఆశ ఎలాగూ

లేదు. కానీ ఎలా? ఎలా?! ఎవర్నని అడగాలి? తన తో సన్నిహితంగా ఉంటూన్న తనకి తెలిసినవాళ్ళంతా, తనలాంటివాళ్ళే. ఎవరిస్తారు అప్పు? డబ్బున్నవాళ్ళకైతే, తిరిగొస్తుంది కదా అనే ధైర్యంతో ఇస్తారు. కాని, దాసుకి గతిలేని దాసుకిస్తే అసలు తిరిగొస్తుందో? రాదో?! తన పిచ్చి గాని, డబ్బున్న వాడికి అప్పెందుకు! తిరిగివ్వలేనివాడికి అప్పిచ్చేవాళ్ళెవరు? మరలాంటప్పుడే సమాజంలో 'అప్పు' అనే మాటెలా పుట్టింది?

—పిచ్చి పిచ్చి ఊహల సందులో మబ్బుల వెనక మెరుపులాంటి ఆలోచన తట్టింది దాసుకి-అవును – 'ఇసామియా బజారు'లో జగ్గారావనే దూరపుచుట్టం-వరసకి బాబాయి-ఉన్నాడు ఆయన్నడిగితే ఏదైనా ఉపయోగం ఉండవచ్చు. అంతే!

ఒక్క నిముషం వృధా చేయకుండా, స్టాండులో ఉన్న సైకిలు తీసుకుని వాయువేగ- మనోవేగాల్తో అటువైపుగా ప్రయాణించాడు.

మిట్టమధ్యాహ్నం వేళ. ఎదురెండ మొహాన్ని చుర్రుమనిపిస్తోంది. కాలేజీకి ఇసామియా బజారులో బాబాయి యింటికీ సుమారు అయిదుమైళ్ళ దూరం ఉంటుంది. మధ్యాహ్నం భోజనానికి ఇంటికి వెళ్ళాలి. అమ్మ ఎదురుచూస్తూం టుంది. తన అదృష్టం బాగుండి బాబాయి డబ్బిస్తే-టైమయిపోయేలోగా, జోరుగా సైకిలు తొక్కుకుంటూ తిరిగొచ్చి, ఫీజు కట్టేయొచ్చు. ఝుంమ్మని ముసిరే ఆలోచనల్ని వెనక్కి నెట్టుకుంటూ సైకిలు తొక్కుతున్నాడు దాసు.

ఒక్క ఉదుటులో సైకిలుదిగి, ఓరగా గోడకి చేరేసి. క్షణంలో మెట్లు ఎక్కి గుమ్మంలోకి వచ్చిన దాసుకి అంచికి ఇంటికివచ్చి, అప్పుడే ఆఫీసుకి తిరిగి వెళ్తున్న జగ్గారావు కనిపించాడు!

"బాబాయ్! ఫైనల్ పరీక్షకి ఫీజు కట్టాలి. ఈ రోజు లాస్టుడేటు. ఫీజుకి సరిపడడబ్బు ఎలాగైనా సర్దితే! రెండు మూడురోజుల్లో తిరిగి ఇచ్చేస్తాను." ఆయాసంతో రొప్పుతూ, గబగబా అడిగేశాడు దాసు గుమ్మంలోనే.

అసలే ఛాందసుడైన జగ్గారావు, ఎదురు మంచిది కాకపోవడంతో వెనక్కి వెళ్ళడమా, తీరా బయల్దేరి వెనక్కి వెళ్ళడం మంచిదికాదు కాబట్టి ముందుకే నడవడమా? అన్న సందిగ్ధంలో పడ్డం వల్ల దాసేమంటున్నాడో వినిపించుకోలేదు. "ఏమిటంటున్నావు?" అని ప్రశ్నించి, మరోమారు కథనంతా చెప్పించుకుని "ఇదుగో! ఏమోయ్! నేనలా ఆఫీసు కెళ్తున్నా గానీ. దాసొచ్చాడు. కొంచెం డబ్బు కావాల్ట. ఇచ్చి పంపించు." అని భార్యకి పురమాయించి గుమ్మం దాటేశాడు 'వస్తానోయ్' అని దాసుకి చెప్తూ.

ఆ మాటలువిన్న దాసుకి చెవుల్లో జగ్గారావు అమృతం పోసినట్లనిపిస్తే, ఎంతకావాలని అడిగి, చేత్తో డబ్బు తీసుకొచ్చి ఇచ్చిన జగ్గారావు భార్య సాక్ష్యాత్తు లక్ష్మీదేవిలా కనిపించింది.

"అయినా ఇలా అర్ధాంతరంగా వచ్చి అడిగితే కష్టం కాదూ ఎవరికైనా! ముందుగావచ్చి చెప్పి తీసికెళ్ళవచ్చుగా" కొంచెం మందలిస్తూన్నట్టుగా ఆమెఅన్న మాటలు వినిపించుకునే స్థితిలో లేడు దాసు. డబ్బందుకుని గిరుక్కునవెనక్కి తిరిగివచ్చి, సైకిలెక్కి ద్విగుణీకృత వేగంతో ప్రయాణమయ్యాడు కాలేజీ వైపు.

మిడసరి లగ్నం. మండుటెండలో, మహా జోరుగా సాగిపోతున్న సైకిలు 'ఠాప్' మన్న పెద్ద శబ్దంతో హఠాత్తుగా ఆగిపోయింది. ముందు టైరు బరస్టయిన చక్రం ముందుకెళ్ళనని మొరాయించింది. ముందుకు పడిపోయి, మోకాళ్ళు చెక్కుకుపోయిన దాసుకి, ఏమయిందో తెలుసుకోడానికి క్షణం పట్టలేదు

"యూ టూ బ్రూటస్!" అని జూలియస్ సీజర్‌లా జాలిగా దానికేసి చూసి, మౌనంగా, ముదున్న సైకిలు షాపులో పడేసి, నడక మొదలెట్టాడు కాలేజీ వైపు. అతనింకా సగందూరం మాత్రమే వచ్చాడు.

తారురోడ్డుమీద ఎండకి కరిగిన తారు, తొడుక్కున్న 'హవాయి' చెప్పులకి అంటుకుని అతని నడకవేగానికి అంతరాయం కలిగిస్తోంది. వీపుమీద ఛెళ్ళున పడుతున్న ఎండ, చిన్నప్పట్నుంచీ తాగిన నీటిని శరీరంలోంచి చెమటరూపంలో పైకి లాగుతూంటే, ఆహారంలేనికడుపు 'ఆకలో' అని అరుస్తూంటే, అవన్నీ లెక్కచేయకుండా, 'అర్జంటు'గా కాలేజీకి చేరుకోవాలనే ఆతృతతో; పెద్దపెద్ద అంగలేసుకుంటూ రోడ్డుమీద నడుస్తున్న దాసుకి ధ్యేయం ఒక్కటే. దూరంగా కనిపిస్తున్న కాలేజీ ఆఫీసుకి టైమయిపోయేలోగా చేరాలి. ఫీజు కట్టేయాలి. తనని తాను మరిచిపోయి నడుస్తున్నాడు.

అడుగు తీసి, అడుగు ముందుకు వేసిన దాసుకి, అరికాలు చుర్రుమనడంతో క్రిందికి చూశాడు, బాగా కరిగి మడుగులా ఉన్న తారులో, కాలం తీరిన తన హవాయి చెప్పులు రెండూ సజీవ సమాధి అయి

మరేం లేదండి మావారికి కొత్త సినిమాలంటే నచ్చవ్! అందుకని



పోవడంతో, తను ఖాళీ కాళ్ళతో రోడ్డు మీద నిలబడ్డాడు. శరీరమంతా చెమటతో తడిసి ముద్దయింది. కానీ, ఎండ వేడి వల్ల ఒళ్ళంతా ఓవెన్‌లో ఉన్నట్టుంది. మోకాలుమీద గీసుకుపోయిన దెబ్బ కొద్దిగా నొప్పి పెడుతోంది. అరికాళ్ళకి వేడి తారంటుకువి చుఱుమని వేడి కాళ్ళల్లోంచి పైకెగ్రబాకుతోంది. ఒక్కసారిగా నిస్పృహ, నిరాశలు తన్నావహించగా, తన పరిస్థితిపై తనకే జాలేసి ఇక వేడి నిట్టూర్పు విడిచాడు దాసు. మరుక్షణంలో తన కళ్ళెదురుగా కరుగుతున్న తారును చూసి, కరిగిపోతున్న కాలం జ్ఞప్తికిరాగా, వీల్లేదు ఈ పరీక్షలో నేను నెగ్గాలి. ఎన్ని అవాంతరాలైనా దాటి ఈ రోజు నేను ఫీజు కట్టి తీరతాను అన్న ధృఢ నిశ్చయంతో అలాగే పరుగులాంటి నడకతో కాలేజీ ఆఫీసు చేరుకున్నాడు దాసు.

ఫీజు కట్టే కౌంటరు ఖాళీగా ఉండటంతో ఒక్క ఉదుటన అక్కడికి వెళ్ళి కంగారుగా డబ్బందియ్యబోతున్న దాసు వాలకం చూసి గుమాస్తా రహమతుల్లా ఆశ్చర్యపోయాడు. "ఇంకా కౌంటరు క్లోజు చెయ్యలేదు భాయీసాబ్. పావుగంట పైనుంది. కంగారుపడకండి" అని చెయ్యి చాచి డబ్బందుకుంటున్న రహమతుల్లా "నీకేం ఫరవాలేదు. నేనున్నా"నని అభయం ఇస్తున్న మహమ్మదులా అనిపించాడు దాసుకి. ఫీజు కట్టినట్టు రసీదు ముట్టిన దాసుకి లోకమంతా వినిపించేటట్టు అరవాలనిపించింది. ఒక్కసారి ప్రపంచమంతా చుట్టుముట్టి. కనిపించిన ప్రతీవాళ్ళకీ 'నేను ఫీజు కట్టేశా'నని చెప్పాలనిపించింది. కానీ కడుపులో ఆకలి దహించుకుపోతూంటే, నీరసం తన్నావహించి కృంగదీసేస్తూంటే మిగిలిన క్లాసుల కారోజు స్వస్తిచెప్పి కాళ్ళీడ్చుకుంటూ, ఇంటివైపు దారితీశాడు.

ఇంటిదగ్గర తనకోసమే ఎదురు చూస్తున్న అమ్మ "ఏం బాబూ భోజనానికి రాలేదేం? ఏమైంది అలా ఉన్నావు? సైకిలేదీ?" అని ప్రశ్నిస్తూంటే, అన్నింటికీ ఒక్కటే సమాధానం చెప్పాడు దాసు. అమ్మా! నేను పరీక్ష ఫీజు కట్టేశాను" అని ఆశ్చర్యానందమిళిత కంఠస్వరంతో 'డబ్బెక్కడిదిరా' అని అడిగి 'సరేలే ముందు భోంచెయ్యి. తరవాత చెప్పొచ్చు' అంది ఆ అమ్మ మనసు. అన్నం తింటూ జరిగిందంతా తల్లితో చెప్పి, సంతృప్తితో తేలికైన మనసూ, శరీరమూ, విశ్రాంతిని కోరుతూంటే మెల్లగా నిద్రాదేవి ఒడిలోకి జారుకున్నాడు దాసు, ఆ వేళ కాని వేళలో.

హాయిగా పైలాపచ్చీసుగా తిరుగుతూ, బాధ్యతల్తో ప్రమేయం లేకుండా కాలం గడిపేవలసిన వయసులో పడరాని పాట్లు పడుతున్న కొడుకుని చూసి 'ఆయనుంటే, ఇలాగే జరిగుండేదా?'



అనుకుని ఆలోచనల్లో మునిగిపోయింది అమ్మ సోమిదేవి.

దాసు ఇంటరు ఫైనలియర్లో ఉండగా పోయాడు వాళ్ళ నాన్న. దానితో, కనుచూపు మేరలో గమ్యాన్ని చేరుకోనున్న జీవితనౌక పెనుతుఫానులో చిక్కుకున్నట్టయింది. ఆ గాఢాంధకారంలో ఒకే ఒక మినుకు మినుకుమనే ఆశ. చదువులో చురుకైన వాసు ఎప్పటికైనా చుక్కాని చేపట్టి ఆ దరికి చేరవచ్చు.

నిరాధారంగా మిగిలిన దాసునీ, వాళ్ళమ్మనీ పరామర్శించడానికి వచ్చిన చుట్టాలంతా, ఈ కుట్ట తమమీదెక్కడ పడుతుందోనన్న భయంతో తప్పుకున్నారు. అంత స్థితిమంతుడు కాకపోయినా, కొండయ్యమామే కొంత నయం. పల్లెటూళ్ళో పొలం పుట్రా చూసుకుంటూ, పెద్ద కుటుంబ భారం ఉన్నప్పటికీ, ఉన్నంతలో, 'వేన్నీళ్ళకి చన్నీళ్ళు తోడ'న్నట్టుగా సహాయం చేస్తానన్నాడు. దానికి కారణం, రక్తం పంచుకుపుట్టిన తోబుట్టువు బ్రతుకిలా ఛిన్నాభిన్నమైనందుకు జాలి కావచ్చు, లేక సమయం వచ్చినప్పుడు. ఈడైన

తన మూడో కూతుర్ని చేసుకోమంటే మేనల్లుడు మాట దాటిపోడనే నమ్మకం కావచ్చు. అది వేరే విషయం. అన్నిటి కంటే ముఖ్యమైనది - చిన్ననాటి స్నేహితుడు-రజనీ-తనకి పిలున్నం తలో చిన్నచిన్న పార్టుటైం ఉద్యోగా లిప్పిస్తానని ప్రోత్సహించడం. తత్ఫలి తంగా దాసు చదువుకి మాత్రం అంత రాయం కలగలేదు. పోతే, తనింక ఇంజనీరు, డాక్టరు కాలేడు. అది డబ్బుతో పని. ఈ చేదునిజాన్ని చిన్న వయ సులో జీర్ణంచేసుకుని బి.ఏ.లో చేరాడు. అవసరాని కాదుకున్న మిత్రుడు రజనీ, మామయ్య కొండయ్యల సహాయంతో ఫైనల్‌లో కొచ్చాడు. ఈ మూడేళ్ళూ దామా, తల్లీ ఎక్కడున్నారో, ఏం కట్టారో, ఏం తిన్నారో భగవంతుడి కెరుక. ఈనాడు దాసు ఇంత సంతో షంగా ఉన్నాడంటే దానికి కారణం లేదూ!

గత స్మృతుల్తో గుండెలు బరువై నిద్రపోతోన్న కొడుకు ప్రక్కనే కూర్చుని కంటికి మింటికి ఏకధారగా ఏడుస్తున్న సోఖిదేవి కన్నీరు చూడ లేక సూర్యుడు నెమ్మదిగా పశ్చిమ దిశలోకి జారుకున్నాడు.

*　　*　　*

రాత్రి ఎనిమిది గంటలయింది. తన బంగళాలోని బెడ్‌రూంలో కూర్చుని గోల్డుఫ్రేం కళ్ళద్దాల్లోంచి, ఎన్నిసార్లు చదివినా అర్ధంగాని గాంధీనీతిసూత్రాల్ని తిరగేస్తున్న నర్సిరెడ్డిగతుక్కుమన్నారు.

అవును మరి వయసులో ఉన్న కూతురు బియ్యే ఫైనలియర్ చదువు తున్నది. హఠాత్తుగా గదిలో ప్రవేశించి "నాన్నా! నావల్ల ఓ తప్పు జరిగి పోయింది. నన్ను క్షమించవూ?" అంటే ఏ నాన్నయినా గతుక్కు మంటాడు. అందులోనూ రాజకీయ దురంధరుడుగా పేరుపొంది, హైలెవెలు మానమర్యాదలున్న నర్సిరెడ్డి క్షణం పాటు నివ్వెరపోవడంతో ఆశ్చర్యమేమీ లేదు. కానీ అంతలోనే నిలదొక్కు కున్నాడు. అదే అతని ప్రత్యేకత. గాంధీగారి ధర్మమా అని గొర్రెల్లాంటి ప్రజల్ని దారితప్పించి తను వెనకేసు కున్న లక్షలు వెన్నుతట్టగా తన్ని తాను తమాయించుకుని, 'ఏమమ్మా? ఏం జరిగింది? వివరంగా చెప్పు" అని సము దాయింపుగా అడిగాడు తన గారాలపట్టిని ఉన్నది పుష్టి కదా మానవులకి.

"మా కాలేజీలో పరీక్షఫీజు కట్టడా నికి ఈ రోజు ఆఖరిరోజు నాన్నా. నేనేదో పరధ్యానంలో కట్టడం మరిచి పోయాను. ఈ సంవత్సరం అంతా వేస్టవుతుంది కదా.".

కూతురి అమాయకత్వానికి ఫక్కున నవ్వాడు నర్సిరెడ్డి. "భంపేశావు కదమ్మా! ఈమాత్రందానికే నువ్వింత ఇదైపోవాలా! అదంతా నే జూసు

కుంటాలే! మీ కాలేజీ ప్రిన్సిపాలు దొరస్వామి కదూ!" అన్నాడు తేలికైన మనసుతో.

"అవును నాన్నా! అయినా ఈ సంవత్సరం నా ప్రిపరేషను కూడా అంతంత మాత్రంగానే ఉంది. వచ్చే ఏడాది పరీక్షకెళ్ళొచ్చులే నాన్నా."

"అలా ఎందుకమ్మా! పరీక్ష పాసూ, ఫెయిలూ నీ చేతిలో ఏముంది? అదంతా నే జూసుకుంటానన్నాగా! రేపుదయం నువ్వు ఫీజు తీసుకెళ్ళి కట్టు. ఇప్పుడు నువ్వు నిశ్చింతగా వెళ్ళి నిద్రపో. నీకేం భయం లేదు. ఊఁ! వెళ్ళు" అని కూతుర్ని పంపించేసి, ఇంపోర్టెడ్ ఇన్‌స్ట్రుమెంటు టెలిఫోన్ హాండిల్ ఎత్తి ఓ నంబరు డయలు చేశాడు.

*　　*　　*

మర్నాడుదయం మామూలుగా కాలేజీ కెళ్ళిన దాసు ఆఫీసులో ఫీజుకౌంటరు ఇంకా తెరిచి ఉండడం చూసి, ఆశ్చర్య పోయి అటు వెళ్ళాడు. నోటీసు బోర్డు మీద క్రొత్తగా అంటించిన నోటీసు! "పరీక్షఫీజు కట్టడానికి ఆఖరితేదీ మరొక రెండు రోజులు పొడిగించబడినది. ఇక ఎట్టి పరిస్థితుల్లోనూ మళ్ళీ పొడిగించ బడదు" అని. క్రింద ప్రిన్సిపాలు దొరస్వామి సంతకం.

'ఛీ! ఏమిటీ మనుషులు!' అను కున్నాడు. దాసు ఆపాదమస్తకమూ క్రోధంతో కంపించిపోయాడు. ఈ భూమిని ఒక గ్రుద్దుతో బద్ధలుచేయా లనిపించింది. నిన్న ఎండలో సలసలా కాగిన రక్తం ఈ రోజు క్రోధంతో ఉడికి పోయింది.

కానీ దాసుకి తెలియదు. ఆ నోటీసు మీద పెన్నుతో సంతకం చేస్తూన్న ప్పుడు దొరస్వామిలోని దేవుడు, దాసు వెన్నులో బాకుపోటు పొడిచినట్టు ఫీల య్యాడనీ. అప్పుడే రూములోంచి బైటికి వచ్చిన దొరస్వామిని, దాసు రుద్రుడై చూసిన చూపులు రెండుబాకుల్లా అతని గుండెల్లో దిగి, అతన్ని కలచి వేశాయనీ, అందుకేఆయన తలొంచుకుని అటు వెళ్ళిపోయాడనీ.

దాసుకి తెలియని విషయాలింకా చాలా ఉన్నాయి. దొరస్వామి నర్సిరెడ్డి చేతుల్లో కీలుబొమ్మ అనీ, నర్సిరెడ్డి తల్చుకుంటే దొరస్వామిని నల్లిని నలిపినట్లు నలి పేయగలడనీ దొరస్వామి బ్రతుకూ ఉద్యోగం అంతా అతనిమీద ఆధారపడి ఉన్నాయనీ......

ఈ కల్లోల జనసాగరంలో దాసు దొరస్వామికి చిన్న చేప. దొరస్వామి, నర్సిరెడ్డికి చిన్న చేప.